క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయపరిసరాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బి సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మణ్, మల్లయ్య, చిన్నారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



బాల్కొండ: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ డిమాండ్ చేశారు. సోమవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. జార్జిరెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పేద విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మహేశ్, కృష్ణ, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అల్మాష్ రాష్ట్ర స్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ భూపతి సోమవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నారాయణపేట్ జిల్లాలో నిర్వహించనున్న అండర్-14 వాలీబాల్‌పోటీల్లో పాల్గొంటారన్నారు. అల్మాష్‌ను హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన ఆకోజు అజయ్, లావణ్య దంపతులు సోమవారం రూ.25 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్రి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



కమ్మర్‌పల్లి: ప్రముఖ కవి సుబ్రహ్మణ్య భారతీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం భారతీయ భాషా మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు, ఫజిల్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు బంతీలాల్, మధుబాబు, శ్రీనివాస్, వర్ష తదితరులు పాల్గొన్నారు.

లిల్లిపుట్‌లో 'ఎల్లో కలర్ డే'



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో సోమవారం ఎల్లో కలర్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపురంగు దుస్తుల్లో అలరించారు. కరస్పాండెంట్ రామకృష్ణ పసుపు రంగు విశిష్టతను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లలో అరకొర సౌకర్యాలు!

- అసంపూర్తిగా వాటర్ ట్యాంకు
- పూర్తి కాని ప్రధాన రోడ్డు
- నీటిగోస తప్పడం లేదంటున్న లబ్ధిదారులు



బాల్కొండ మండల కేంద్రంలోని డబుల్‌బెడ్ రూం ఇళ్లు

బాల్కొండ: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో అరకొర సౌకర్యాలతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రంలో 176 డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేశారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నెలరోజుల ముందు లబ్దిదారులకు ఇళ్ల పంపిణీ చేయగా, అప్పటి నుంచి లబ్దిదారులు నివాసముంటున్నారు. కానీ సౌకర్యాలు పూర్తిగా కల్పించలేదు. వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశారు. దీంతో బోరు ద్వారానే నీరు సరఫరా అవుతున్నది. పైపులైన్లు లేక పోవడంతో చివరి వరకు నీరు అందడం లేదని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంకునిర్మాణం పూర్తయితే వాటర్ ట్యాంకు ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే అవకాశం ఉంటుంది. కానీ ట్యాంకు నిర్మాణ పనులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో నీటిగోస తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా ప్రధాన రోడ్డు

బాల్కొండ మండల కేంద్రంలోని కొండ ప్రాంతంలో గ్రామానికి చివరన డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారు. మండల కేంద్రం నుంచి వన్నెల్(బి) వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టారు. రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డును బీటీగా మార్చాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం కోసం కంకర వేసి తారు వేయడం మరిచారు. దీంతో కాలనీకి వెళ్లాలంటే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర వేయడంతో అటు వైపు వెళ్లాలంటే జంకుతున్నారు. కాలనీలో మురికి కాలువలు కూడా అసంపూర్తిగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన ప్రధాన రోడ్డు

త్వరలోనే పూర్తి చేస్తాం

డబుల్ బెడ్ రూం కాలనీలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. వాటర్ ట్యాంకు నిర్మాణం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించాం. పనులు చేపట్టాలని ఆదేశిస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈఈ, ఆర్అండ్‌బీ, బాల్కొండ

వైద్యశిబిరానికి అపూర్వ స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కంటివైద్య నిపుణుడు

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రతిభా ఆస్పత్రి డాక్టర్ ఇర్ఫాన్‌అలీ, బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ సతీశ్, డెంటల్ డాక్టర్ అబ్దుల్ రజాక్, ఫిజియోథెరపిస్ట్ అర్చన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత, నేత్ర, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. 222 మంది ఉచిత వైద్య సేవలను పొందినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడి కేంద్రం చిన్నారులకు నోట్‌పుస్తకాలు, పలకలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ పుష్పలత రమేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ శ్యామ్‌సుందర్ పహడే, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సభ్యులు మచ్కూరి రమేశ్, పుట్టి సాగర్, డాక్టర్ మహేశ్, రీజియన్ లంక రవి, క్యాంప్ ఇన్‌చార్జి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడోకు ఎంపిక



మణిదీప్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్రస్థాయి జూడో పోటీలో కాంస్య పతకం సాధించిన నందిపేట మండల కేంద్రంలోని నియోలిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి మణిదీప్‌ను సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించి సన్మానించింది. సుల్తానాబాద్ లో ఈ నెల 5, 6వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీలో మణిదీప్ అత్యుత్తమ ప్రతిభకబర్చి కాంస్య పతకం సాధించాడు. మణిదీప్‌ను పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రధానోపాధ్యాయుడు రవికిరణ్, ఇన్‌చార్జి అఖిల, వ్యాయామ ఉపాధ్యాయుడు వికాస్ అభినందించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

బాల్కొండ: ఆటో డ్రైవర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి బాల్కొండ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు జోగు సంగీత సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆలోచన చేయాలని పేర్కొన్నారు.

చక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



బోధన్‌రూరల్(బోధన్) : కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చక్రేశ్వర శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ శివ లింగానికి అభిషేకం, పూజలు చేశారు. ఆలయ ప్రధా న అర్చకులు గణేశ్‌మహరాజ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, అర్చకులు మహేశ్ పాఠక్, శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువ కబ్జా!



బాల్కొండ మండల కేంద్రంలో కాలువను పూడ్చేసిన దృశ్యం

తూతూ మంత్రంగా అధికారుల చర్యలు

బాల్కొండ: మండల కేంద్రంలో ఎస్సారెస్పీ ఇరిగేషన్‌కాలువను దర్జాగా కబ్జా చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులపుకుంటున్నారని, దీంతో రోజురోజుకూ కబ్జా వ్యవహారం పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మండల కేంద్రంలోని సాయికుంట, నాగులకుంటలకు అనుసంధానంగా గతంలో కాలువను తవ్వారు. కాలువ కోసం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసింది. భూమి కోల్పోయిన పట్టాదారులకు పరిహారాన్ని అందించింది. కానీ బాల్కొండలో రియల్టర్ల దందా జోరుగా సాగడం, భూముల ధరలకు రెక్కలు రావడంతో కాలువలను సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాలువను పూడ్చి కాలువపైనే ఇంటి నిర్మాణం చేపట్టడానికి ముగ్గు వేశారంటే ఏ స్థాయిలో కబ్జా యత్నం సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ముగ్గుపోసిన వద్ద గుంతలు తవ్వితే మైనర్‌ఇరిగేషన్ అధికారులు వెళ్లి గుంతలను పూడ్చి వేశారు. అంతే కాకుండా గతంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన అవార్డుపత్రాలను కబ్జాదారులకు చూపించి, బాధ్యులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా కాలువకు ఇరువైపుల ఉన్న వారు సైతం కాలువనుపూడ్చి కబ్జా చేసేందుకు ప్రయత్నాలను వేగవంతం చేశారు. గత రెండు రోజుల్లోనే ఇంకో చోట కాలువను పూడ్చి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అసలు కాలువకు ఎంత భూమిని కేటాయించారనేది అధికారులకు తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పక్కర్లేదు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న భూములను వెలికి తీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కాలువను పూడ్చి ఇంటి నిర్మాణంకోసం ముగ్గు వేసిన దృశ్యం

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. ఫలితంగా భూ ఆక్రమణలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఎన్టీఆర్ కాలనీలోని 1333 సర్వే నంబరులో భూమిని కబ్జా చేస్తున్నారని వీడీసీ సభ్యులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలో కొండలకు పట్టాలు ఉన్నాయంటూ కొందరు తవ్వకాలు చేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి కబ్జాల బాగోతానికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

చర్యలు చేపడుతాం

సాయికుంట, నాగుల కుంటకు అనుసంధానంగా తవ్విన కాలువ కబ్జాకు అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఒక చోట పనులను నిలిపివేశాం. పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– శేఖర్‌బాబు, ఏఈఈ, మైనర్‌ఇరిగేషన్, బాల్కొండ

మాజీ సీఎంకు పరామర్శ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/వేల్పూర్ : హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను వాకబు చేశారు. కేసీఆర్‌కు ఇటీవల తుంటి ఎముక విరిగి ఆపరేషన్ జరిగిన విషయం విదితమే. దాంతో ఆయనను ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి పరామర్శించారు.





షుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించాలి



నిజామాబాద్‌రూరల్: జిల్లాలోని మూతపడిన రెండు చక్కెర ఫ్యాక్టరీలను కొత్త ప్రభుత్వం తెరిపించి నడిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ గౌరవ అధ్యక్షుడు, రైతు నాయకుడు నాయక్‌వాడి నర్సయ్యతో కలిసి సోమవారం ఆయన అర్సపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులు, ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించు కోలేదని, బంగారు తెలంగాణ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేయడంతోపాటు వేలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఫ్యాక్టరీలను తెరిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. చెరుకు పండించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు టి కృష్ణాగౌడ్, అగ్గు ఎర్రన్న, బి సాయిలు, గోపాల్, దండు చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి నితిన్

బాల్కొండ: చేపల పెంపకంతో అధిక లాభాలను గడించవచ్చని ఉదయ్ అక్వా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి నితిన్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల రైతులకు సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ.. అక్వా కల్చర్ ద్వారా చేపల పెంపకం చేపట్టాలన్నారు. సంప్రదాయ పంటల నుంచి ప్రత్యామ్నాయం వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. రైతులు చేపలపెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు గంగాధర్, ప్రసాద్‌రావు, విక్రమ్‌రెడ్డి, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ



రథోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



మంగళహారతులతో మహిళలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నవనాథ సిద్ధేశ్వర, అన్నపూర్ణ సీతారామ, అయ్యప్ప విగ్రహాల ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరిరోజు స్వామివారి విగ్రహాలతో గిరిప్రదక్షిణ (ఊరేగింపు) నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కేదారేశ్వర ఆశ్రమ మహరాజ్ మంగిరాములు, నందీశ్వర మహరాజ్ దేవతామూర్తులకు పూజలు చేసిన ఊరేగింపు ప్రారంభించారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గిరి ప్రదక్షిణ రథోత్సం ఆర్మూర్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎల్లమ్మ ఆలయం నుంచి ఆలూర్‌రోడ్, కాశీహనుమాన్ మందిరం, గోల్‌బంగ్లా జంబిహనుమాన్ మీదుగా రథోత్సవం కొనసాగింది. కాలనీల్లో మహిళలు పెద్దఎత్తున స్వామివారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి సుమన్, బి కిషన్, పీసీ గంగారెడ్డి, కౌన్సిలర్లు, మహిళలు, సర్వసమాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గన్నారు.

కక్షపూరిత చర్యలు మానుకోవాలి



ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు నాయకులపై కక్ష పూరిత చర్యలను మానుకోవాలని కోరుతూ ఆర్డీవో రాజాగౌడ్‌కు ఎస్‌కేఎం (సంయుక్తి కిసాన్ మోర్చా) నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించగా, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు రెండేళ్లు గడిచినా అమలు చేయడం లేదని నాయకులు పేర్కొన్నారు. మరో వైపు ఎస్‌కేఎం జాతీయ నాయకుడు యద్వీర్‌సింగ్‌పై కేసు ఉందని ఆయన ప్రయాణాన్ని అడ్డుకున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గంగాధర్‌అప్ప, పడాల శంకర్ ఉన్నారు.

18 ఏళ్లు నిండిన తరువాతే పెళ్లి చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కమ్మర్‌పల్లి : ఆడపిల్లలు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరీ పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలన, పౌష్టికాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే శరీరం ధృఢంగా తయారవుతుందని తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో సోమవారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. 300 జంటలు సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్నాయి. భక్తులు ప్రతి సంవత్సరం సత్యనారాయణ వ్రతం చేయడం వల్ల కష్టాలు తొలుగుతాయని మహరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం స్వీకరించిన అనంతరం భక్తులు మంగిరాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు.

నేడు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

నిజామాబాద్‌రూరల్: తపాల ఉద్యోగులకు కనీస వేతనం అమలుచేయడంతోపాటు 8గంటల పని వేళలు తదితర డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుంచి నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు డిచ్‌పల్లి మండల పోస్టల్ యూనియన్ అధ్యక్షుడు నర్సిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మెలో ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి పండరినాథ్, కోశాధికారి కొయ్య రవి, సలహాదారులు సదానంద్, సింధూజ, ఆనందరావు, గ్రామీణ తపాల ఉద్యోగులతోపాటు మండల ఉప తపాల కేంద్రం పరిధిలోని 24 మందితోపాటు తెలంగాణ యూనివర్సిటీ నుంచి ఇద్దరు, ఏపీఎస్‌పీ నుంచి ఇద్దరు మొత్తం 28 మంది సమ్మెలో పాల్గొంటారని వివరించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)-9.40, యానిమల్ (హిందీ) 1.00, 5.00, 9.00
- స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30
- స్క్రీన్-3 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)- 11.50, 3.10, 6.30, 9.50
- స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00